PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper




విజయవాడ, హైదరాబాద్ ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు సంపుటి : 01 సంచిక : 148 ఆదివారం , ఆగస్టు 30 , 2026 , పేజీలు - 8 వెల : 3 /-

## నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

- తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో మిగతా2లో...

## అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చాం

- సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్
- మన ఆరోగ్యం ..మన ఫోన్‌లోనే
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే
- గిరిజన ప్రాంతాల్లో సెల్ టవర్ ద్వారా కనెక్టివిటీ పెంచుతాం
- గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే అందేలా చేస్తాం
- అరకు పర్యటనలో సిఎం చంద్రబాబు




**పాడేరు ఆగస్టు 29:** ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామ రాజు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాం. సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉంది. ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించాం. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ఈ ప్రభుత్వానిది. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్‌టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతాం. గిరిజనుల ప్రతి ఒక్క సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం. 3 నెలల్లో ఇక్కడ ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తాం. ఏ వైద్య పరీక్ష అయినా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. మిగతా2లో...

## ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ప్రధాని నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధం అయ్యారు. రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మిగతా2లో...

## కూటమిది నరికే సంస్కృతి కాదు... నాటే సంస్కృతి

- భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- ప్రకృతి, ఆధ్యాత్మికతల అద్భుత సమ్మేళనం "అశ్వత్థ నారాయణ వివాహం"
- అరణ్యారామంలో రావి, వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు






## నేనే నమ్మకద్రోహినే అయితే జైలులో ఎలా ఉంటా..?

వైసిపి దుష్ప్రచారాలపై విజయసాయి మండిపాటు

**అమరావతి, ఆగస్టు 29:** తాను ఏనాడూ నమ్మకద్రోహం పనులు చేయలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. తనపై నమ్మకద్రోహి అంటూ వైకాపా కోటరీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఈమేరకు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. 'నేను నమ్మకద్రోహినే మిగతా2లో...

## 31 వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

- నిర్వాసితుల కోసం రూ.4.07 కోట్ల నిధుల విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం




## అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

- 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'
- క్రీడా దినోత్సవ ముగింపు సభలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి




**తిరుపతి, ఆగస్టు 29:** అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో మాట్లాడుతూ.. భారతదేశానికే ఆదర్శంగా అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు కానున్నాయని తెలి పారు. క్రీడలను ప్రోత్సహించటంలో భాగంగా సీఎం చంద్రబాబు.. ప్రముఖుల అకాడమీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. పీవీ సింధు, పు÷-లలెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖుల అకాడమీలకు ప్రభుత్వం నుంచి స్థల కేటాయించినట్లు చెప్పారు. అరకు నుంచి తిరుపతి వరకు, మిగతా2లో...

## వక్ఫ్ సంస్థల పురోగతిపై చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష



**అమరావతి, ఆగస్టు 29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, వక్ఫ్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్ సంస్థల సందర్శనలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ అంశాలు, కొనసాగుతున్న వివిధ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఉన్న వక్ఫ్ సంస్థల సంఖ్య, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు ఇప్పటి వరకు సందర్శించిన సంస్థలు, సందర్శనలకు సంబంధించిన ఆధారాలు, ఇంకా సందర్శి ంచాల్సిన సంస్థలు, వాటిని మిగతా2లో...



## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్

**విశాఖపట్టణం, ఆగస్టు 29:** బంగాళా ఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా ల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం మిగతా2లో...

# అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం.. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది' అని సీఎం తెలిపారు. గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా.. శెభాష్ అన్న ముఖ్యమంత్రి.. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. అందరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా సంజీవని వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కనెక్టివిటీ పెంచేందుకు కూడా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు భారం కాదని.. పిల్లలే మన సంపద అని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందాలని సూచించారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. కొండ ప్రాంతాల్లోని వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదనేది తన సంకల్పమని ఉద్ఘాటించారు. దీని కోసమే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంజీవని కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను పెద్ద ఆస్పత్రికి డ్రోన్ల ద్వారా తరలించి పరీక్ష చేసి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. 104 వాహనాల ద్వారా సంచార వాహనాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. గిరిజనులతో పాటు రాష్ట్రంలో ప్రతీ పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్- 3 మేమే తీసుకువచ్చాం. గత పాలకులు నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసింది. ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తాం. ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశాం. అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశాం. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోం స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుంది. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో 150 వాహనాలతో ఎమ్జంగ్÷న్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉంది. కొండ ఎంత దూరంలో ఉన్నా... వైద్యం మీ దగ్గరకు రావాలి. మంచి వైద్యం అందాలి. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి.. అందుకే సంజీవని తీసుకువచ్చాం. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి. గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తెస్తున్నాం. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నాం. గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఎఎ÷ు మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నాం. ఎఎ÷ు, ఔఇఇ÷ు వంటి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నాం. గిరిజన రైతులు తమ ఉత్పత్తితో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి.భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్-2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్ కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాం ఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ అక్షలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

## కూటమిది నరికే సంస్కృతి కాదు... నాటే సంస్కృతి

**మంగళగిరి, ఆగస్టు 29:** ప్రకృతి సంరక్షణలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు అన్నారు. హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో సాంప్రదాయ రావి, వేప మొక్కల నాటే కార్యక్రమంలో నాగబాబు, సతీమణి పద్మజ కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావి, వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మీడియాతో మాట్లాడుతూ "భూమాత మనకు పరోక్షంగా జన్మనిచ్చిన తల్లి. మనం పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు అవసరమైన ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి ఎన్నో వనరులను భూమాత నుంచే పొందుతున్నాం. మన తల్లిదండ్రులు మనకు పెట్టే ప్రతి ఆహారపు ముద్ద కూడా భూమాత ప్రసాదించినదే. అలాంటి భూమాతకు తిరిగి మనం ఏమి చేస్తున్నాం అని ప్రతి ఒక్కరు ఆలోచించాలి. అడవులను నరికి వేయడం, విచక్షణారహితంగా మైనింగ్ చేయడం, ప్రకృతిని కాలుష్యం చేయడం ద్వారా మనమే భూమాతను గాయ పరుస్తున్నాం. భూమాతను కాపాడటం మన బాధ్యత మాత్రమే కాదు, మన కర్తవ్యం అన్నారు. ప్రకృతి పరిరక్షణకు... అశ్వత్థ నారాయణ వివాహంభారతీయ సంప్రదా యంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన అశ్వత్థ నారాయణ వివాహం సంప్రదాయం ప్రకృతి, ఆధ్యాత్మికత, సామరస్యానికి ప్రతీక. రావి, వేప చెట్లను ఒకే గుంతలో నాటే ఈ సంప్రదాయంలో రావి చెట్టును విష్ణుమూర్తికి, వేప చెట్టును లక్ష్మీదేవికి ప్రతీకలుగా భావించడం మన సంస్కృతిలో ప్రకృతికి ఇచ్చిన విశిష్ట స్థానం. రావి, వేప చెట్లు కలిసి పెరగడం ద్వారా పచ్చని పరిసరాల ఏర్పాటుకు, స్వచ్ఛమైన వాతావరణానికి, జీవ వైవిధ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుంది. ఈ చెట్లు దాదాపు 250 జీవరాశులకు ఆవాసంగా మారి, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆ ఆలోచనే మమ్మల్ని కలిపింది ఏదైనా మంచి పని మొదలుపెట్టే ముందు మొక్క నాటడం నా అలవాటు. ప్రకృతిని ప్రేమించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కళ్యాణ్ కి, నాకూ ఒకే రకమైన ఆలోచనలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని వారికి చెట్లను నరకడమే తప్ప, నాటాలనే ఆలోచనే వాళ్లకు రాలేదు. ఏ కార్యక్రమం చేసినా అడ్డువచ్చిన చెట్లను నరుక్కుంటూ పోయారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం కెన్యా వంటి దేశాలే అడవులకు, వన్యప్రాణులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయి. మరి జ్ఞానానికి పురిటిగడ్డ అయిన మన భారతదేశం, పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అరణ్యారామం డిజైన్లు పరిశీలించిన నాగబాబు** రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం 24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు.

ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు నాగబాబు కి వివరించారు. అలాగే తాడేపల్లి పరిధిలోని అటవీ ప్రాంత వివరాలను తెలియజేశారు.

# 31 వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

**- నిర్వాసితుల కోసం రూ.4.07 కోట్ల నిధుల విడుదల**

**- ఉత్తర్వులు జారీ చేసిన ఎపి ప్రభుత్వం**

**అమరావతి, ఆగస్టు 29:** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఈ నెల 31న జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను వారి పునరావాస కాలనీలకు స్వచ్ఛందంగా తరలించేందుకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.4.07 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా పశువుల దాణా, నిత్యావసర సరుకులు, మహిళలకు ప్రత్యేక కిట్లను అందించనుంది. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని 10 గ్రామాలకు చెందిన నిర్వాసిత కుటుంబాల వద్ద ఉన్న పశువులకు 30 రోజుల పాటు దాణా అందించనున్నారు. మొత్తం 4,933 పశువులకు దాణా అందించేందుకు రూ.65.8 లక్షలు కేటాయించారు. ఇందుకోసం మొత్తం 295.98 మెట్రిక్ టన్నుల దాణా అవసరమని అధికారులు అంచనా వేశారు. నిర్వాసిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించేందుకు ప్రభుత్వం రూ.2.81 కోట్లు కేటాయించింది. మొత్తం 10,000 మందికి నిత్యావసర సరుకుల కిట్లను అందించనున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.2,818గా నిర్ణయించారు. ఈ కిట్‌లో 25 కిలోల బియ్యం, కిలో పప్పు, కిలో చక్కెర, లీటర్ వంటనూనె, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళాదుంపలు ఉంటాయి. నిర్వాసితులు కొత్త ఇళ్లలోకి ప్రవేశించే సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా కిట్లను అందించనున్నారు. మొత్తం 6,000 కిట్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.1,000గా ఉంటుంది. ఇందులో చీర, గాజులు, పసుపు, కుంకుమ ఉంటాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.60 లక్షలు కేటాయించింది. పశువుల దాణా, నిత్యావసర సరుకుల కిట్లు, మహిళలకు ప్రత్యేక కిట్ల కోసం కలిపి ప్రభుత్వం మొత్తం రూ.4.068 కోట్లు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను వారి పునరావాస కాలనీలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా తరలించేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నిర్వాసితులకు పరిహారం కింద ప్రభుత్వం రూ.768 కోట్లు అందించినట్లు అధికారులు తెలిపారు.

## నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసర మైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షి తంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.

## నేనే నమ్మకద్రోహినే అయితే జైలులో ఎలా ఉంటా..?

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకునేవాడిని. సీబీఐ, ఈడీ ఛార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. నమ్మకస్తుణ్ని అనే కారణంతో ప్రతి ఛార్జిషీట్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నా పేరు చేర్చింది. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు కారాగారంలో ఉంచారు. నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లోనూ ఏ-5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ2గా చేర్చారు. సకల శాఖల మంత్రి పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జిషీట్‌లోనూ లేదు. ఏ కేసులూ లేకుండా ఎలానో కోటరీ నాయకుడికి తెలిసినంత నాకు తెలియదు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఉత్తరాంధ్ర నేతతో కలిసి కోటరీ నాయకుడు కుట్ర పన్నారు. నాపై అసత్యాలు చెప్పి ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించారు. జగన్ మెప్పు కోసమే నాస్తికుడిగా చెప్పుకొన్న ఆయన వైకాపాకే కాదు.. రాష్ట్రానికే నమ్మకద్రోహి. నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించిందెవరు? 2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శృతిమించింది? జగన్‌ను ఎవరూ కలవకుండా గోడ కట్టింది సజ్జల కాదా? అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

## వక్ఫ్ సంస్థల పురోగతిపై చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అలాగే, వివిధ విభాగాల పనితీరు, సమస్యలు, సవాళ్లు, పెండింగ్ అంశాలపై సంబంధిత విభాగాధిపతులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.వక్ఫ్ ఆస్తుల క్షేత్రస్థాయి సమాచార సేకరణ, రికార్డుల ధృవీకరణ, డిజిటలైజేషన్ కోసం రూపొందించిన "ప్రాజెక్ట్ అమానహ్" పై చైర్మన్ ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి ప్రత్యేక ఐడీ కేటాయించి, ఆస్తి వివరాలు, భౌతిక స్థితి, ఫోటోలు, ఆక్రమణలు, న్యాయపరమైన అంశాలు, రికార్డుల వ్యత్యాసాలు తదితర సమాచారాన్ని ఆధారాలతో సేకరించి, ధృవీకరించిన డిజిటల్ రికార్డుగా రూపొందించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ముందు 7 రోజుల పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించనున్నారు. ఇందులో ఫీల్డ్ డేటా సేకరణ, ఫారమ్ వినియోగం, డేటా నాణ్యత, రిస్క్ గుర్తింపు, యాక్షన్ ట్రాకింగ్, జిల్లా స్థాయి డ్యాష్‌బోర్డ్ వంటి అంశాలను పరీక్షించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని చైర్మన్ సిబ్బందికి సూచించారు. ప్రతి విభాగం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ యాఖూబ్ ఖాజీ, డీఈఈ అబ్దుల్ ఖాదర్, ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, సెక్షన్ హెడ్‌లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచంలో ఏ ఈవెంట్ జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక క్రీడాకారుడైనా పాల్గొనాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని చెప్పుకొచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం(ధ్యాన్‌చంద్ జయంతి), తెలుగు భాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి) తిరుపతి వేదికగా క్రీడాకారులకు మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలియ జేశారు. రాబోయే 50 ఏళ్లకు సరిపడా అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని 3 జోన్లుగా(వైజాగ్, అమరావతి, తిరుపతి) విభజన చేసినట్లు తెలిపారు. క్రీడా పరికరాల తయారీ కోసం నెల్లూరు పరిసరాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తిరుపతిలో కేటాయించిన స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆడిటోరియాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు పాఠశాలల గ్రౌండ్లను సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రతిభను వెలికితీసేలా కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సంపాదకీయం

## నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి ప్రక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

## సహాయక చర్యలపై సందిగ్ధత

**- ఎట్టకేలకు విదేశీ నిపుణల రాకకు నేపాల్ అంగీకారం**

**ఖాఠ్మండ్,ఆగస్ట్29:** జలప్రళయ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సహకరిస్తామంటూ పలు దేశాలు ముందుకురాగా.. నేపాల్ ఆ అభ్యర్థనలను తొలుత తిరస్కరించింది. ఇప్పుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. విదేశీ సహాయక బృందాలను దేశంలోకి అనుమతించేందుకు అంగీకరించింది. తమ బృందాలు సహాయక చర్యలు నిర్వహించగలవని, విదేశీ బృందాలను అనుమతించబోమని ఇటీవల నేపాల్ వెల్లడించింది. అయితే గల్లంతయిన వారిలో పలు దేశాల ప్రజలు ఉన్నారు. దాంతో సహాయక చర్యల్లో భాగం అవుతామని ఆయా దేశాల నుంచి వచ్చిన దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా చివరకు నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. సొరంగాల్లో రక్షణ చర్యలు చేపట్టగల సిబ్బంది, డీఎన్ఏ టెస్టింగ్, ఫోరెన్సిక్ పరీక్షలు చేయగల అంతర్జాతీయ బృందాలనే అనుమతించాలని భావిస్తోంది. నిర్దిష్ట విభాగాల్లో.. పరిమిత సంఖ్యలోనే రెస్క్యూటీమ్స్‌కు అనుమతి తెలపనున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. పొరుగుదేశం నేపాల్‌కు భారత్ నుంచి అత్యవసర సహాయం అందుతోంది. తాజాగా 10 టన్నుల సామగ్రితో మూడో విమానం ఆ దేశంలో ల్యాండ్ అయింది. అలాగే 11 మంది బృందం కూడా వెళ్లింది. వారిలో వైద్యులు, సొరంగాల వద్ద సహాయక చర్యలు నిర్వహించగల సిబ్బంది, ఇతరులు ఉన్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న 84 మంది భారతీయుల్ని కాపాడారు. వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 21 మంది భారత్‌కు చేరుకున్నారు. 320 మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని భారత ప్రభుత్వం వెల్లడించింది. ఇక ఈ విలయంలో మృతుల సంఖ్య 616కి చేరింది. 2400 మందికిపైగా గల్లంతయ్యారని నేపాల్ పోలీసులు వెల్లడించారు.



# నేపాల్‌లో మృత్యుంజయులు

### చనిపోయారనుకున్న ఇద్దరు తనయులు రాక

### కన్నీటి పర్యంత నుంచి తేరుకున్న తల్లి ఆనందబాష్పాలు

**ఖాఠ్మండ్,ఆగస్ట్29:** నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలకు 616 మంది మృతిచెందగా, సుమారు 2,500 మంది గల్లంతయ్యారు. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో కుటుంబాలు తమ వారిని కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఇదే సమయంలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ ప్రాణాలతోనే ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. రాసువా జిల్లాకు చెందిన మట్టి మాయా తమాంగ్ (28) అనే మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడు జోయల్ ఘలే (8). బుధవారం ఉదయం వారిద్దరూ పాఠశాలకు వెళ్లగా.. కొద్దిసేపటికే భారీ శబ్దం వినిపించడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన తమాంగ్‌కు భయానక దృశ్యం కనిపించింది. వరద నీరు, బురద, రాళ్లు భారీగా ప్రవహిస్తూ ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. ఇదే క్రమంలో పాఠశాల భవనాన్నీ వరద నీరు ధ్వంసం చేసింది. పిల్లలు వరదల్లో కొట్టుకుపోయి ఉంటారని భావించిన తమాంగ్.. వారిని వెతుక్కుంటూ పలు సహాయక శిబిరాలు తిరిగింది. అయినా వారి ఆచూకీ మాత్రం ఎక్కడా దొరకలేదు. దీంతో కుమారులిద్దరూ చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. అయితే చిన్నారి జోయల్ ప్రాణాలతో బయటపడ్డాడు. వరద సమయంలో ఓ స్నేహితుడితో కలిసి పాఠశాల నుంచి అడవిలోకి పారిపోయాడు. వరద నీటి నుంచి తప్పించుకునేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో అతని కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చేతులు, ముఖానికీ గాయాలయ్యాయి. గురువారం నాడు బాలుడిని గుర్తించిన పోలీసులు.. నువాకోట్ జిల్లాలోని 15 పడకల చక్ర దేవ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖాఠ్మాండూ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఓ జర్నలిస్టు సహాయంతో జోయల్ ఆచూకీని తమాంగ్ గుర్తించింది. వెంటనే ఆస్పత్రికి చేరుకుని కుమారుడిని కలుసుకుంది. జోయల్‌ను చూసే వరకూ అతను బతికే ఉన్నాడన్న విషయాన్ని తమాంగ్ నమ్మలేకపోయింది. ఒక్కసారిగా కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. అప్పటికే చిన్న కుమారుడు కూడా దొరకడంతో కథ సుఖాంతమైంది. 8 ఏళ్ల బాలుడు చెట్టు ఎక్కి వరదల నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డాడు. ఎట్టకేలకు రెండు రోజుల తర్వాత తన తల్లిని తిరిగి కలుసుకోగలిగాడు. నేపాల్‌కు చెందిన జోయల్ ఘలే, అతడి సోదరుడు బుధవారం పాఠశాలకు వెళ్లారు. ధాడింగ్ జిల్లాల్లో వరదల ధాటికి పలు స్కూళ్లు కొట్టకుపోయాయి. స్థానికంగా ఉన్న ఓ చెట్టును పట్టుకొని జోయల్ ఘలే ప్రాణాలు కాపాడుకున్నాడు. ఒళ్లంతా గాయాలతో రోజంతా చెట్టుపైనే ఉండి సహాయం కోసం ఎదురు చూశాడు. అతడిని రక్షించిన సహాయక బృందాలు వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్చాయి. తన ఇద్దరు కుమారుల కోసం అనేక శిబిరాల్లో వెతికినా ఎక్కడా వారి ఆచూకీ దొరక్కపోవడంతో ఆశలు వదులు కున్నానని బాలుడి తల్లి మాయా తమాంగ్ పేర్కొన్నారు. తన కుమారుడు బతికే ఉన్నట్లు అధికారుల నుంచి సమాచారం అందడంతో నమ్మలేక పోయానన్నారు. అనంతరం మరో కుమారుడిని కూడా స్థానిక అధికారులు రక్షించినట్లు తమకు సమాచారం అందిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ పిల్లలను కాపాడిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

### ● ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో

### ● లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

**న్యూఢిల్లీ,ఆగస్ట్29:** నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది.

ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది.

కాగా.. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి.

ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి.

ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది.

అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు.

తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# నేపాల్ విలయం



నేపాల్‌లో జల ప్రళయం వేలాది కుటుంబాలకు కన్నీళ్లను మిగిల్చింది. హిమాలయాల ఎత్తుల్లో కదిలిన మంచు, రాళ్లు, మట్టి చివరకు భోటేకోశీ నదిని ఉగ్రప్రవాహంగా మార్చాయి. ఇండ్లు, వంతెనలు, రహదారులు, విద్యుత్ మౌలిక వసతులు కొట్టుకుపోయాయి. తమవారు వస్తారేమోనని ఎదురుచూస్తున్న కుటుంబాలు, ఆచూకీ కోసం సాగుతున్న గాలింపు చర్యలు, శిథిలాలుగా మిగిలిన జీవితాలు ఆ దేశ విషాదాన్ని మరింత హృదయ విదారకంగా మారుస్తున్నాయి. ఈ దృశ్యాలు ప్రపంచాన్నే కంటతడి పెట్టించాయి. తాజా నివేదికల ప్రకారం వేయికి పైగా ప్రాణాలు బలయ్యాయి. గల్లంతైన చాలామంది ఆచూకీ ఇంకా దొరకడం లేదు. ప్రస్తుతం వరదనీరు వెనక్కివెళ్లినా, దానివెంట కొట్టుకుపోయిన బతుకులు, మిగిల్చిన శూన్యం, కుటుంబాల గుండెల్లో నింపిన వేదన మాత్రం ఇంకా అక్కడే ఉంది. ఈ విపత్తు ఎలా సంభవిం చిందని చర్చించుకోవడంకంటే ఏం నేర్పుతున్నదన్నదే ముఖ్యం. ఇది కేవలం వరద కాదు, పర్వతం కదిలితే నది ఎలా మారుతుంది, నది మారితే మనిషి జీవితం ఎంతవేగంగా ఛిన్నాభిన్నమవుతుందో చూపించిన విధ్వంసం. హిమాల యాల్లో మారుతున్నది కేవలం మంచు పరిమాణం కాదు. మంచు, శిలలు, పర్వత వాలులు, నదుల మధ్య ఉన్న సహజ సమతుల్యత కూడా. ఈ ఘటనలో కూడా హిమనదంలోని భారీ భాగం కూలి, మంచు,రాళ్లు,మట్టి కలిసి నదీ ప్రవాహాన్ని అడ్డుకోవడం, ఆ అడ్డంకి తెగిపోవడంతో విధ్వంసక ప్రవాహం ఏర్పడినట్లు తెలుస్తోంది. అంటే విపత్తు నదిలో మొదలుకాలేదు, పర్వతంలో మొదలై నదిని మార్చి, చివరకు మనిషి జీవితాన్ని కూల్చింది. నేపాల్‌లో పర్వత ప్రాంతాల్లో పర్యాటకం, చిన్న వ్యాపారాలు, వ్యవసాయం, జలవిద్యుత్, సరిహద్దు వాణిజ్యం పరస్పరం అనుసం ధానమై ఉన్నాయి. రహదారులు, వంతెనలు తెగిపోవడమంటే మార్కెట్లు దూరమవడం, విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతినడమంటే ఆదాయం తగ్గడం, పర్యాటక మార్గాలు మూసుకుపోవడమంటే వేల కుటుంబాల ఉపాధి దెబ్బతినడం. అందుకే ప్రకృతి విపత్తు పేదరికాన్ని మరింత లోతుగా చేసే ప్రమాదం కలిగిస్తుంది. అయితే, నేపాల్ ఇప్పటికే రాజకీయంగా పెద్ద మార్పును అనుభవిస్తున్న సమయంలో ఈ విపత్తు వచ్చింది. గతేడాది యువత అసంతృప్తి, పాత రాజకీయ వ్యవస్థపై వ్యతిరేకత, అవినీతి, పాలనా వైఫల్యాలపై జెన్-జీ ఆగ్రహం కొత్త రాజకీయ శక్తికి దారితీశాయి. బలేంద్ర షా నేతృత్వంలోని ప్రభుత్వం ఆ మార్పునకు ప్రతీకగా అధికారంలోకి వచ్చింది. ఇలాంటి సమయంలో ప్రకృతి విపత్తు కొత్త ప్రభుత్వానికి కేవలం సహాయక చర్యల పరీక్ష కాదు, ప్రజలు కోరుతున్న కొత్త పాలన ఎంతవరకు ప్రజా భద్రతను ప్రాధాన్యంగా చూస్తుందో తేల్చే పరీక్ష కూడా. ఈ ఘటనకు నేపథ్యంగా హిమాలయాల మారుతున్న స్వభావాన్ని చూడాలి. ఉష్ణో గ్రతలు పెరుగుతున్న కొద్దీ హిమనదాలు గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ (జిఎల్ఓఎఫ్)కూడా ఇదే ప్రమాద శ్రేణిలో భాగం. హిమనదాలు కరుగు తున్నప్పుడు ఏర్పడే సరస్సులకు సహజంగా మంచు, మట్టి, రాళ్ల అడ్డుకట్టలు ఉంటాయి. అవి బలహీనపడితే భారీ నీటి ప్రవాహం ఒక్కసారిగా దిగువకు దూసుకుపోతుంది. ప్రస్తుత విపత్తుపై కూడా అలాంటి విశ్లేషణలు వెలుబడుతున్నాయి. ఈ సమయంలో పాలకుల 'అభివృద్ధి నమూనా'ను కూడా పునఃపరిశీలించాలి. పర్వతాలు భరించే సామర్థ్యాన్ని పట్టించు కోకుండా రహదారులు, సొరంగాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక నిర్మాణాలు పెంచడం ప్రమాదాన్ని పెంచుతుంది. అభివృద్ధి అవసరం. కానీ, ప్రకృతిని లెక్కచేయని అభివృద్ధి చివరకు అభివృద్ధి చేసిన మనిషినే బలి తీసుకునే పరిస్థితి రాకూడదు. అదే నేపాల్ పాలనా వ్యవస్థలోని లోపాల్ని కూడా బహిర్గత పరిచింది. ఇది భారత్‌కు కూడా హెచ్చరికే. హిమాలయ నదులు రాజకీయ సరిహద్దులను గుర్తించవు. నేపాల్‌లో పుట్టే ఆకస్మిక వరదలు దిగువన భారత నదీ పరివాహక ప్రాంతాలను ప్రభావితం చేయగలవు. భారతీయులు కూడా గల్లంతైనవారిలో ఉన్నట్టు వార్తలొస్తు న్నాయి. కుటుంబాలు తమవారి సమాచారం కోసం ఎదురుచూస్తున్నాయి. అందువల్ల నేపాల్ విషాదం పొరుగు దేశం ఎదుర్కొంటున్న సమస్యగా కాకుండా మన ఉమ్మడి హిమాలయ భద్రతకు సంబంధించిన అంశంగా చూడాల్సిన అవసరం ఉంది. భారత్ సహా అనేక దేశాలు నేపాల్‌కు మానవతా సహాయం అందించేందుకు ముందుకొచ్చాయి. అది తక్షణ ప్రాణ రక్షణకు అవసరం. కానీ, సహాయం తర్వాతి దశ పునర్నిర్మాణం మాత్రమే కాకుండా విపత్తు మళ్లీ మహావిపత్తుగా మారకుండా చేసే శాస్త్రీయ వ్యవస్థ నిర్మాణం కావాలి. భారత్, నేపాల్, చైనా, భూటాన్ మధ్య హిమ నదాలు, మంచు సరస్సులు, వర్షపాతం, నదీ ప్రవాహాలు, భూస్కలనాలపై నిరంతర సమాచార మార్పిడి అవసరం. ఉపగ్రహాలు, సెన్సార్లు, డ్రోన్లు, రియల్‌టైమ్ నదీ గేజ్‌లను అనుసంధానించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థను నిర్మించుకోవాలి. ఈ విపత్తు నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సిన పాఠమిదే.

# మాతృ భాష దినోత్సవ వేడుకలు



**సోంపేట, 29 ఆగష్టు :** శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా మరియు మాతృ భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు కళాశాలలో ప్రిన్సిపాల్ డా.డి. రామారావు మాట్లాడుతూ.తెలుగు మాతృభాష ఆలోచనలను పదును పెడితే, క్రీడలు




గెలుపోటములను సమానంగా స్వీకరించే మనోధైర్యాన్ని ఇస్తాయని వక్తలు పేర్కొన్నారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ ఆదర్శాలను విద్యార్థులు పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి రామారావు ఫిజికల్ డైరెక్టర్ కె రామారావు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం మోపొద్దు: అలజంగి జోగారావు



**పార్వతీపురం, 29 ఆగషు:** నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరింతగా ధరలు పెరిగితే సామాన్యుల జీవనం భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యావసర సరుకుల ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఉపశమనం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని జోగారావు హెచ్చరించారు.

# నేత్రదానంతో పునర్జన్మ పొందండి.. ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపండి



**పార్వతీపురం, 29 ఆగష్టు :** జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నర్సిపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా. విజయలక్ష్మి పాల్గొని నేత్రదాన ప్రాముఖ్యతను వివరించారు. ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేసి అంధత్వ నివారణకు తమ వంతు కృషి చేయాలని కోరారు.జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. జగన్ మోహన్ రావు కంటి చూపు సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్రదానంపై ఉన్న అపోహలను వివరించారు. జిల్లా నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ మరణానంతరం శరీరంలో దానం చేయగల ముఖ్యమైన అవయవాల్లో నేత్రాలు కూడా ఉన్నాయని, నేత్రదానం ద్వారా మరొకరికి చూపును అందించి పునర్జన్మ పొందినట్లవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సీఆర్‌పీ అనురాధతో పాటు పలువురు ఉపాధ్యాయులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డా. శ్రీరాములు, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ధరల భారంతో సామాన్యుడి జీవనం భారంగా మారింది: ఆర్.వి.ఎస్. కుమార్



**పార్వతీపురం, 29 ఆగష్టు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వి.ఎస్. కుమార్ విమర్శించారు. నిత్యావసర వస్తువులు, పప్పులు, నూనె, పంచదార ధరలు భారీగా పెరిగాయని అన్నారు. పేదలకు అనుకూలంగా ఉండాల్సిన ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ ప్రజలపై భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నిత్యావసర ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ పీజీఆర్ఎస్

**- మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి అర్జీల స్వీకరణ**

**- అర్జీల నమోదు నుంచి పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, ఆగస్టు 29, 2026**

ప్రజల సమస్యలను సులభంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి అయిదు గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ప్రతి స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) రిజిస్టర్‌ను నిర్వహిస్తూ పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలనా కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, నమోదు చేసి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారన్నారు. వ్యవసాయ సహాయకులు, సర్వే అసిస్టెంట్లు, రెవెన్యూ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు కూడా ఆయా సమయంలో అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ప్రతి పనిదినం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్వీకరించబడును అనే సమాచారంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఇప్పటికే ఆదేశించామన్నారు. క్యూఆర్ కోడ్ ఫీడ్‌బ్యాక్, పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజల భాగస్వామ్యంతో సేవల నాణ్యతను మెరుగుపరచాలని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అర్జీలను జవాబుదారీతనంతో, నాణ్యంగా పరిష్కరించేలా మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల చెంతనే సమస్యల పరిష్కారానికి వీలుగా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# ఆర్థిక పరిజ్ఞానంతో మహిళా సాధికారతకు కొత్త దిశ!

**- వ్యాపార విజయానికి ఆర్థిక నిర్వహణ అత్యంత కీలకం**

**- అవగాహనతో అడుగులు వేస్తూ విజయాలను అందుకోండి**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**






**విజయవాడ, ఆగస్టు 29, 2026**

స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నారని... అయితే మహిళలు వ్యాపారాలను ప్రారంభించడం మాత్రమే కాకుండా, వాటిని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శనివారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో ఫిక్కీ ఎఫ్ఎల్‌వో విజయవాడ చాప్టర్ సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారతలో ఆర్థిక అక్షరాస్యత పోషించే కీలక పాత్రను ఫిక్కీ ఎఫ్ఎల్‌వో విజయవాడ చాప్టర్ చైర్‌పర్సన్ సుప్రియా మల్లినేని సమక్షంలో సంస్థ ట్రెజరర్,





సీఏ తుల్జా భవానీ వివరించారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్, ఆదాయపు పన్ను, జీఎస్‌టీ, వ్యాపారానికి సంబంధించిన ఇతర చట్టపరమైన అంశాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక అంశాలపై పట్టుద్వారా వ్యాపారాలను మరింత విజయవంతంగా విస్తరించుకోవచ్చని వివరించారు.

కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడం, ఆదాయాన్ని పెంచుకోవడం ఎంత ముఖ్యమో, వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా నిర్వహించడం, ఖర్చులను నియంత్రించడం, పొదుపు చేయడం, భవిష్యత్ అవసరాలకు ప్రణాళిక రూపొందించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఆర్థిక అక్షరాస్యత కలిగిన మహిళలు తమ వ్యాపారంలో లాభనష్టాలను అంచనా వేసుకోవడంతో పాటు, సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఆర్థికంగా అవగాహన కలిగిన మహిళలు కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లోనూ, వ్యాపార నిర్ణయాల్లోనూ మరింత ఆత్మవిశ్వాసంతో వ్యవహరించగలుగుతారని తెలిపారు. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు కుటుంబ స్థిరత్వానికి, పిల్లల భవిష్యత్‌కు, వ్యాపార అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. డిజిటల్ లావాదే వీలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళా వ్యాపారవేత్తలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచిం చారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి.తేజస్విని పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు..

**- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**


యన్.టి.ఆర్ జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్, విజయవాడ

పత్రికా ప్రకటన

శిక్షణా కార్యక్రమములు:-

శ్రీయుత వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల సహకార ఆర్థిక సంస్థ లి., తాడేపల్లి వారు చదువుకున్న ఎస్.సి నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించు నిమిత్తము ఈ క్రింది చూపిన కోర్స్ నందు నైపుణ్యతతో కూడిన శిక్షణా కార్యక్రమములు నిర్వహించుటకు అదేశములు ఇచ్చియున్నారు.

- కోర్స్ : Service Technician – Home Appliances / Multi Skill Technician (గృహోపకారణాల వస్తువుల రిపేర్లు)
- అర్హత : 10వ తరగతి పాస్ లేదా ఇంటర్మీడియట్ పాస్ అయి, అవసరమగు ముందస్తు అనుభవం కలిగిన నిరుద్యోగ ఎస్.సి అభ్యర్థులు అర్హులు
- శిక్షణ ఇచ్చు ప్రదేశము : విజయవాడ, యన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
- కోర్సు వ్యవధి 90 రోజులు (3 మాసములు)
- శిక్షణా కాలములో పురుషులకు, స్త్రీలకు వేరు వేరుగా వసతి సదుపాయము కల్పించబడును
- శిక్షణ పొందగోరు అభ్యర్థులకు ఉచిత భోజన వసతి సదుపాయము (Free food & accommodation) కల్పించబడును.

పై కోర్సులో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశములు (Placements) కల్పించుటకు నిర్ణయించినారు. అభ్యర్థుల వయస్సు 21 సం.ల నుండి 45 సం.ల వరకు వుండవలెను. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు వారి విద్యార్హత పత్రములు, కుల ధృవీకరణ పత్రము, ఆధార్ మరియు రైస్ కార్డు నకళ్ళతో ఈ క్రింది చూపిన వెబ్ సైట్ నందు నమోదు చేసుకొనవలెను ( https://apsccorporation.ap.gov.in ) లేదా వెంటనే స్వయముగా కృష్ణా జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్, జిల్లా కలెక్టర్ గారి కార్యాలయపు ఆవరణ, చిలకలపూడి పోస్ట్, మచిలీపట్టణం కార్యాలయము నందు సమర్పించవలెను.

పై పేర్కొనిన విషయము పై సందేహములున్నచో పూర్తి వివరముల కొరకు సంప్రదించవలిసిన చిరునామా : కృష్ణా జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్, జిల్లా కలెక్టర్ గారి కార్యాలయపు ఆవరణ, చిలకలపూడి పోస్ట్, మచిలీపట్టణం. మరియు ఫోన్ ద్వారా - 9652057244 / 9848214161 సంప్రదించవచ్చును.

సం/- జె.సత్యవతి,
కార్యనిర్వాహక సంచాలకులు,
యన్.టి.ఆర్ జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్, విజయవాడ.

// అనుమతి తో //
కార్యనిర్వహణాధికారి



**విజయవాడ, ఆగస్టు 29, 2026**

ఈ నెల 30వ తేదీ ఆదివారం జరిగే నీట్ పీజీ–2026 పరీక్షను సజావుగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్డర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడలో పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు) కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. మొత్తం 843 మంది అభ్యర్థులు పరీక్షరాసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ శనివారం పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలతో పాటు ఇతర సౌకర్యాల కల్పనను పరిశీలించారు. భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు సరైన విధంగా ఉండేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగే కంప్యూటర్ ఆధారిత పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశసందర్భంగా ఆదేశించారు.

# స్వర్ణాంధ్ర-2047 నిర్మాణంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి

**- ఏపీలో పెట్టుబడులు పెట్టండి.. ప్రభుత్వ పూర్తి సహకారం**
**- గడ్డ ఏదైనా మన మూలాలన్నీ ఆంధ్రప్రదేశ్‌వే**
**- మలేసియా ౯ాూవీ వేడుకల్లో మంత్రి కొండపల్లి**







**అమరావతి, ఆగస్టు 29 :** స్వర్ణాంధ్ర-2047 నిర్మాణంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. శనివారం మలేషియాలోని ౯ాూవీ 70వ ప్లాటినం జూబ్లి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి పాల్గొన్నారు. మలేసియాలోని పెనాంగ్ వాటర్‌ఫ్రంట్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ 1955లో చిన్న విత్తనంలా ప్రారంభమైన మలేషియా తెలుగు సంఘం నేడు 5 లక్షల మంది తెలుగు ప్రజలకు అండగా.. ఒక మహావృక్షంలా నిలబడడం ప్రశంసనీయం అని మంత్రి కొనియాడారు. ఈ 70 ఏళ్ల ఈ ప్రస్థానం ఏడు తరాల కృషికి, తెలుగు బంధానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర--2047 లక్ష్యంతో ముందుకు సాగుతోందని... అభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.. ఇలా ప్రతి రంగంలో కొత్త అవకాశాలను సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం ప్రవాసాంధ్రుల రక్షణ, సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ద్వారా రూ. 10 లక్షల ఉచిత ప్రమాద బీమా , 24/7 హెల్ప్‌లైన్, సెల్ మరియు పెట్టుబడుల కోసం 'వన్-స్టాప్ సేవలు' అందిస్తున్నామని వివరించారు.× సోదరుల రక్షణ, శ్రేయస్సు మరియు భాగస్వామ్యం కోసం ఒక ఎన్ఆర్టీ శాఖా మంత్రిగా ఎప్పుడు మీ కోసం అందుబాటులో ఉంటానని మంత్రి తెలిపారు. మలేసియాలో మీరు సాధించిన వ్యాపార నైపుణ్యాలను, అనుభవాన్ని మన ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని.. ఇక్కడ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మలేషియాలో ఉన్న ఎన్ఆర్ఐ సోదరులు మలేసియా అభివృద్ధిలో భాగస్వాములవుతూనే, మన తెలుగు గుర్తింపును విశ్వవ్యాప్తం చేశారని.. ఆంధ్రప్రదేశ్ మీ కోసం ఎప్పుడూ తలుపులు తీసి ఉంచుతుందని.. మీకు ఏ అవసరం వచ్చినా, మీ హక్కుల రక్షణకు, మీ సంక్షేమానికి మన ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. రాష్ట్రంలో రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా 6 నూతన పారిశ్రామిక విధానాలను ప్రవేశపెట్టామని... మీావీజులు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి అమరావతి కేంద్రంగా విశాఖ, తిరుపతి, అనంతపురంలలో 'రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్లు' ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మలేసియాలోని తెలుగు పారిశ్రామికవేత్తలు తమ అనుభవాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని, పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆహార ప్రాసెసింగ్, తయారీ రంగం, పర్యాటకం, డిజిటల్ సేవలలో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి కొండపల్లి తెలిపారు. గడ్డ ఏదైనా... మన రక్తం తెలుగు, మన మూలాలు ఆంధ్రప్రదేశ్ అని పేర్కొంటూ, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో చీ=×లు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన ప్రసంగాన్ని ముగించారు

## బాల సాహిత్యంలో 'మేలిమి బంగారం'.. బి.వి. పట్నాయక్ కలం ప్రత్యేకత



**పార్వతీపురం, 29 ఆగష్టు :** జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల సందర్భంగా పార్వతీపురం మండలం నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రముఖ రచయిత బి.వి. పట్నాయక్ రచించిన 'మేలిమి బంగారం' బాల కథల పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోను సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు గంటేడ గౌరునాయుడు, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, మంచిపల్లి శ్రీరాములు సంయుక్తంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి పాటోజు బ్రహ్మాజీ రావు రచయిత బి.వి. పట్నాయక్‌ను అభినందించారు. పిల్లల్లో నైతిక విలువలు, ప్రణాళికాబద్ధత, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి బాల సాహిత్య పుస్తకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. నల్లా బాలకృష్ణ పుస్తక పరిచయం చేస్తూ సైన్స్, ప్రకృతి విజ్ఞానం, మానవీయ విలువలను సంక్షిప్త కథల ద్వారా పిల్లలకు అర్థమయ్యేలా వివరించడం 'మేలిమి బంగారం' ప్రత్యేకతగా పేర్కొన్నారు.కార్యక్రమంలో డా. బెహరా గుంపస్వామి, బెలగాం వేణుగోపాలరావు, ఆర్. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మ భాషను అందరూ ఆదరించాలి : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య



**పెద్దపల్లి, ఆగస్టు 29 :** కమ్మనైన తేట తెలుగు అమ్మ భాషను అందరూ ఆదరించాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. శనివారం ఉషన్నపల్లి గ్రామంలోని పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలు, తెలుగు భాషపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషా దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ... దేశ భాషల్లో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కఠిన హృదయాలను సైతం కరిగించే శక్తి తెలుగు భాషకు ఉందని పేర్కొన్నారు. మూఢనమ్మకాలను తొలగించి వైజ్ఞానిక సమాజాన్ని ముందుకు నడిపించడంలో మాతృభాష కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇతర భాషలతో పోలిస్తే మాతృభాషలో బోధన ద్వారా విద్యార్థులు విషయాలను సులభంగా, సంపూర్ణంగా అర్థం చేసుకోగలరని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఆంగ్ల భాషపై మోజుతో చాలామంది తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాష అభివృద్ధి, విస్తృతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృత, సురేష్ కుమార్, మంద శ్రీవాణి, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**ఎన్‌టీఆర్ జిల్లా/విజయవాడతేదీ: ఆగస్టు 29, 2026**
ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినప్పటికీ, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను సమర్పించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులు, సిబ్బందిని సూచించారు.ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు ఏదుపాటి రామయ్య (తెదేపా), పి.గోవింద (భాజపా), బి.మురళీకృష్ణ (ఐఎన్‌సీ), జిడగం శ్రీనివాస్ (జేఎస్‌పీ) పాల్గొన్నారు.

# ఎల్నినో భయంతో పెబ్బేరు సంతలో పశువుల వెల్లువ

**- కబేళాలకు మంచి పాడి పశువులు...**
**- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు**



**పెబ్బేరు,ఆగస్టు 29** ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉంటుందన్న భయంతో రైతులు శనివారం పెబ్బేరు పశువుల సంతకు పెద్ద సంఖ్యలో పశువులను విక్రయానికి తీసుకొచ్చారు.పశుదాణా ధరలు ఆకాశాన్నంటడం,పచ్చిగడ్డి దొరకకపోవడ ంతో పశు పోషణ తమకు గుదిబండగా మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.వేల రూపాయలు పెట్టి కొన్న పశువులను తప్పని పరిస్థితిలో అతి తక్కువ ధరకే అమ్ముకుంటున్నామని వాపోయారు. సంతకు వస్తున్న వాటిలో సగానికి పైగా మంచి పాడినిచ్చే పశువులే కావడం, అవి కూడా కబేళాలకు తరలిపోవడం బాధాకరమన్నారు.పాల ధర పెరగక, దాణా ఖర్చులు పెరగడంతో నష్టాలు తప్పడం లేదని, సంతలో దళారుల దోపిడీతో సరైన ధర రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పశువులే జీవనాధారంగా బతుకుతున్న తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఉపాధి కోల్పోయి వలస పోవాల్సి వస్తుందని కంటతడి పెట్టారు.



# దివ్యాంగుల స్వావలంబనకు ప్రగతి చక్రాలు!

**- 58 మందికి ఉచితంగా రూ. 66.70 లక్షల విలువైన వాహనాలు**
**- ఉద్యోగాలు, జీవనోపాధికి ఊతంగా ప్రభుత్వం అండ**
**- గౌరవప్రదమైన జీవనానికి వీలుకల్పించేలా కార్యక్రమం**
**- విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**








**విజయవాడ, ఆగస్టు 29, 2026**
విభిన్న ప్రతిభావంతులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా తమ పనులు చేసుకునేందుకు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు పాల్గొని 58 మందికి రూ. 66.70 లక్షలు విలువైన స్కూటర్లను అందించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ దివ్యాంగులకు ఈ వాహనాలు ఉద్యోగాలు, వ్యాపారాలు, స్వయం ఉపాధి, ఇతర జీవనోపాధి కార్యకలాపాలకు సులభంగా వెళ్లేందుకు ఉపయోగపడతాయని అన్నారు. రోజువారీ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. వాహనం కేవలం రాకపోకలకు మాత్రమే కాకుండా దివ్యాంగుల స్వావలంబనకు, ఆత్మవిశ్వాసానికి, జీవనోపాధికి ఒక సాధనంగా నిలుస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శారీరక వైకల్యం కలిగిన అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా రీట్రోఫిట్ చేసిన మోటరైజ్డ్ వాహనాలను అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు సులభమైన రాకపోకలు, స్వయం సమృద్ధి, గౌరవప్రదమైన జీవనం, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 113 దరఖాస్తులు అందగా జిల్లా ఎంపిక కమిటీ ప్రభుత్వ మార్గదర్శకాలు, అర్హత ప్రమాణాల మేరకు దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఎంపికైన 58 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ. 1.15 లక్షల విలువైన మోటరైజ్డ్ త్రీ వీలర్ వాహనాలను సమకూర్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి వాడ్రేవు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## బారువపేటకు చెందిన పంటపొలాలలో వరినట్లు



**సోంపేట, 29 ఆగష్టు:** శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామంలోని బారువ, బారువపేటకు చెందిన పంటపొలాలలో వరినట్లు మండల అగ్రికల్చర్ అధికారి నరసింహ మూర్తి శనివారం పరిశీంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.పంట సాగు విధానం తెగుళ్ల నివారణ ఆధునిక వ్యవసాయంపై అవగాహనా కల్పించారు. పంటలకు సరిపడే యూరియా అందిస్తామని అన్నారు. ఈ పరిశీలనలు ఆస్తిటెంట్ ఎఓ నీటిసంగం అధ్యక్షులు సాన కామేష్ వైస్సార్సిపి నాయకులు టి ధర్మారావు సాన రాజేష్ ఖన్నా రైతులు తదితరులు ఉన్నారు.

ఆదివారం , ఆగస్టు 30, 2026

PRGI NO: APTEL/26/A1204
కింగ్ డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper



# శ్రీ వెంకటేశ్వర స్వామిశ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం వైభవంగా





**దేవనకొండ ఆగస్టు 29:–** దేవనకొండ మండలం వెలంకూరు గ్రామంలో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా, సంతాన వరప్రదాతగా శ్రీ వెంకటేశ్వర స్వామివారికి విశేషమైన భక్తి విశ్వాసాలు ఉన్నాయి. దీంతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దేవనకొండ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, పోలీస్ సిబ్బందితో పాటు వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# సంక్షేమ వసతి గృహాల్లో డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయాలి

**- విద్యార్థులపై నిరంతరం నిఘా..**

**పకడ్బందీ చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

**కర్నూలు బ్యూరో ఆగస్టు 29:–**జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ వసతి గృహాలు, ఈగల్ టీమ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంచాలని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, కేసుల నమోదుపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని చిప్పగిరి, పెద్దహరివాణం, హాలహర్వి, ఆలూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రహస్యంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం ఉందని, వాస్తవంగా సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే కేసులు నమోదు చేసి అరికట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల్లో సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదని, విద్యార్థులకు పౌష్టికాహారం, తాగునీరు అందించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో నీటి వసతి, మెష్‌లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. అవసరమైతే వసతి గృహాలపై థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైన సౌకర్యాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డీఈఓ సుధాకర్, ఎస్ఎస్ఏ పీఓ లోకరాజు, ఆర్ఐఓ లాలెప్ప, జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు రాధిక, ప్రసూన, డీవీవీ సురేష్‌బాబు, రెసిడెన్షియల్ స్కూల్స్ కోఆర్డినేటర్ పుష్పరాజ్, మైనారిటీ సంక్షేమ అధికారిణి సబిహా పర్వీన్, జ్యోతిబా పూలే విద్యాలయ జూనియర్ లెక్చరర్ యమునాదేవి, లీగల్ టీమ్ ఎస్సై రమేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఎలీషా పాల్గొన్నారు.

# వైఎస్సార్ నగర్‌లో త్వరలోనే నూతన రహదారుల నిర్మాణం

**● టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్**





**నంద్యాల, ఆగస్టు 29:**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నంద్యాల టౌన్ 38 వార్డ్ వైఎస్సార్ నగర్‌లో త్వరలోనే నూతన రోడ్ల నిర్మాణం చేపడతామని టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ తెలిపారు . ఈ సందర్భంగా నంద్యాల పట్టణ పరిధిలోని 38 వ వార్డులో తాటికొండ బుగ్గ రాముడు ఆధ్వర్యంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని పలు వీధులు, రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎన్ఎండీ ఫయాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఏయే ప్రాంతాల్లో కొత్త రోడ్లు వేయాల్సిన అవసరం ఉందో గుర్తించేందుకు నేడు క్షేత్రస్థాయి పరిశీలన జరిపినట్లు వెల్లడించారు. త్వరితగతిన నిధులు సమకూర్చి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి ప్రజల రాకపోకల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 38 వార్డ్ తాటికొండ బుగ్గ రాముడు, మహేష్ బాబు, మరాఠీ సూరి , దీపక్ రెడ్డి, షబ్బీర్, ఫిరోజ్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 31 సోమవారం నాడు సాగునీరు, త్రాగునీటి సాధనకై కలెక్టరేట్ ముట్టడి: మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు



**నంద్యాల, ఆగస్టు 29:** జిల్లాలో సాగునీరు, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31వ తేదీ సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతాంగం, ప్రజల నీటి కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నంద్యాల టౌన్, రూరల్ మరియు గోస్పాడు మండలాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాల నాయకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ముట్టడిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. నీటి హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ గళమెత్తాలని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఘనంగా "జాతీయ క్రీడా దినోత్సవం" వేడుకలు

**నంద్యాల, ఆగస్టు 29:**స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం నాడు "జాతీయ క్రీడా దినోత్సవం" కార్యక్రమాన్ని కళాశాల యాజమాన్యం ఎంతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి, ప్రిన్సిపల్ డా. కె.వి.వి. సుబ్బయ్య, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఏ.ఎస్. ప్రగతి , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. ఇంతియాజ్ అహ్మద్, అతిథులు కలశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ. విజయ్ కుమారీ, డా. వంశీధర్ రెడ్డి, లీనా, డా. శివారెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు క్రీడలలో తమ అనుభవాలను, అభిప్రాయాలను సంతోషంగా పంచుకోవడంతో కార్యక్రమం ప్రారంభమైంది. అధ్యాపకురాలు శ్రావణి గారు మాట్లాడుతూ, విద్యార్థులు పెద్ద ఎత్తున క్రీడలలో పాల్గొనడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. గత ఒక నెల రోజులుగా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ఈ పోటీలను ఎంతో పారదర్శకంగా నిర్వహించిందని, డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి గారి పర్యవేక్షణలో అన్ని విభాగాల విద్యార్థులను సమానంగా ప్రోత్సహించారని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.విజయ కుమారి మాట్లాడుతూ, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని మనం జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఏ.ఎస్. ప్రగతి మాట్లాడుతూ, పోటీలలో గెలుపోటముల కంటే పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడలు జీవితానికి అవసరమైన క్రమశిక్షణ, నిబద్ధత మరియు ఓటమిని స్వీకరించే మానసిక పరిపక్వతను





నేర్పుతాయని, నేటి తరం మొబైల్ వాడకాన్ని తగ్గించి శారీరక దృఢత్వంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా నాయకత్వ లక్షణాలు , సమష్టి కృషితో పనిచేసే తత్వం, ఒత్తిడిని అధిగమించే నైపుణ్యాలను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ సంస్థలు కేవలం అకడమిక్ ప్రతిభనే కాకుండా క్రీడల ద్వారా అలవడే వ్యక్తిత్వ వికాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఉద్యోగ నియామకాలలో ప్రత్యేకంగా గుర్తిస్తున్నాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ చురుగ్గా పాల్గొని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ, నేడు ఎక్కువమంది మొబైల్స్, టీవీలకే పరిమితమవుతున్నారని, ప్రతిరోజూ మైదానంలో ఆడే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని తదుపరి మ్యాచ్‌కు సిద్ధం కావడమే నిజమైన 'స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్' అని పేర్కొన్నారు. ఆగస్టు 29 క్రీడా వేడుకలు నిర్వహించుకోవడానికి ఎంతో పవిత్రమైన రోజని, ప్రతి ఆటకు కేటాయించిన పాయింట్ల ఆధారంగా ఛాంపియన్‌ను నిర్ణయిస్తామని తెలిపారు. ఈ రన్నింగ్ ట్రోఫీని వరుసగా మూడు సార్లు గెలుచుకున్న జట్టుకే అది శాశ్వతంగా సొంతమవుతుందని వెల్లడించారు. డా. శివారెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో క్రీడలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ఈ కళాశాల క్రీడల్లో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని ప్రశంసించారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలలోనూ ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయని పేర్కొన్నారు. గతంలో తమ కళాశాల సౌత్ జోన్ షటిల్ పోటీలలో మూడు సార్లు విజేతగా నిలిచిందని, కళాశాలకు చెందిన ఓ క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం సాధించిందని గుర్తుచేశారు. తక్కువ పోటీ ఉన్న క్రీడలను సైతం ఎంచుకుని నైపుణ్యం సాధిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. బీసీఏ విద్యార్థులకు హేమంత్ రెడ్డి ట్రోఫీని అందజేశారు. ఇంతటితో ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా ముగించారు.

# గండి వీరాంజనేయ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

**మూడో శ్రావణ శనివారం 6 వేల మందికి అన్నప్రసాదం**

**ప్రత్యేక పూజలు, పటిష్ట ఏర్పాట్లు**

**చక్రాయపేట/పులివెందుల ఆగస్టు 29 :** పవిత్ర శ్రావణమాసం సందర్భంగా గండి శ్రీ వీరాంజనేయ స్వామి క్షేత్రం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. శ్రావణమాసంలోని మూడో శనివారం స్వామివారిని దర్శించుకుంటే శుభం కలుగుతుందనే దృఢమైన విశ్వాసంతో కడప జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో గండి క్షేత్రానికి తరలివచ్చారు. మూడో శ్రావణ శనివారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల కోసం ఉదయం 4.30 గంటల నుంచే స్వామివారి దర్శన సౌకర్యాన్ని కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఆధ్వర్యం లో క్యూ లైన్ల వద్ద తాగునీటి సౌకర్యం, ఉచిత అన్నప్ర సాదం వంటి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సుమారు 6,000 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల





రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించింది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన వైద్య సేవలను అందించారు. అలాగేగండి వీరాంజనేయ స్వామివారిని దర్శించుకునేందుకు మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవీంద్రారెడ్డి), ఆయన సోదరులు జోగిరెడ్డి, భారత్ రెడ్డి తదితరులు విచ్చేశా రు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అదేవిధంగాశాశ్వత నిత్యాన్నదాన పథకా నికి పలువురు భక్తులు విరాళాలు అందించారు. పెద్ది వీడు, రాయచోటికి చెందిన నారాయణజయమ్మ దంపతులు రూ.50,000 స్కానర్ ద్వారా విరాళంగా అందించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రామపాటి శ్రీనివాసులుజ్యోతి దంపతులు రూ.30,000 నగదు రూపంలో అందించారు. యర్రగుంట్లకు చెందిన ప్రసాద్ రెడ్డిమాధవి దంపతులు అన్నదానం పీఓఎస్ ద్వారా రూ.25,000 విరాళం అందించారు. స్వామివారి హుండీ, ప్రసాదాల ఆదాయంమూడో శ్రావణ శనివారం సందర్భంగా స్వామివారి దేవస్థానానికి వివిధ మార్గాల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూరింది. అర్జిత సేవ టికెట్ల ద్వారా: రూ.3,61,186లడ్డూ ప్రసాదం ద్వారా: రూ.9,04,500పులిహోర ప్రసాదం ద్వారా: రూ.73,000ప్రత్యేక దర్శనం ద్వారా: రూ.2,48,520 తాత్కాలిక హుండీల ద్వారా: రూ.6,86,311తాత్కాలిక షాపుల ద్వారా: రూ.21,490శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడితో కళకళలాడాయి.

# ఆశా కార్యకర్తపై గ్రామస్తుల ఫిర్యాదు

**● పనితీరు మెరుగుపరుచుకునేందుకు నెల రోజుల గడువు: డీఎంహెచ్ఓ యుగంధర్**

**పులివెందుల ఆగస్టు 29:–** పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేంపల్లి మండలం అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త పనితీరుపై గ్రామస్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. పులివెందుల మండలం కొత్తపల్లిలో డీఎంహెచ్ఓను కలిసి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గతంలో ఆశా కార్యకర్త పనితీరుపై నిర్వహించిన విచారణ నివేదికను పక్కనపెట్టి అధికారులు ఆమెను కాపాడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషణ కమిటీ



సమావేశంలో ఆమె పనితీరుపై చేసిన తీర్మానాన్ని కూడా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఆశా కార్యకర్త కుటుంబ సభ్యులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓను కోరారు. ఈ విషయంపై డీఎంహెచ్ఓ యుగంధర్ మీడియాతో మాట్లాడుతూ ఆశా కార్యకర్త పనితీరుపై ఫిర్యాదులు అందిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఆమెకు పనితీరు మెరుగుపరు చుకునేందుకు ఒక నెల రోజుల సమయం ఇచ్చామని, ఆ వ్యవధిలో పనితీరులో మార్పు కనిపించకపోతే నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేసిన వారిలో అయ్యవారిపల్లెకు చెందిన భూమిరెడ్డి విజయభారతి, రమణారెడ్డి, ప్రసాద్, రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.



# ఆ సినిమా అట్టర్ ఫ్లాప్ అవ్వడానికి కారణం ఇదే.

ఒకప్పుడు స్టార్ డైరెక్టర్ గా తన మార్క్ చూపించాడు శ్రీను వైట్ల. తనదైన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు. కామెడీ ఎంటర్టైమెంట్స్ తో పాటు పవర్ ఫుల్ కంటెంట్ తో సినిమాలు తెరకెక్కించి ఆకట్టుకున్నాడు శ్రీనువైట్ల. ఇక ఈ మధ్య కాలంలో సరైన హిట్ పడలేదు. మహేష్ బాబు హీరోగా వచ్చిన దూకుడు సినిమా తర్వాత ఆ రేంజ్ హిట్ అందుకోలేక పోయాడుదర్శకుడు శ్రీను వైట్ల గతంలో ఓ ఇంటర్వ్యూ లో తన సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 1999లో విడుదలైన తన మొదటి చిత్రం నీ కోసం గురించి ప్రస్తావించినప్పుడు, ఆ సినిమా కథనాన్ని ప్రజలు ఎంతగా ఆదరించారో గుర్తు చేసుకున్నారు. అయితే, మధ్యలో “డ్రీమ్ ప్రాజెక్ట్” అనుకుని రూపొందించిన బ్రూస్ లీ ఎందుకు ఆశించిన విజయం సాధించలేదో అన్న ప్రశ్నకు వైట్ల స్పష్టమైన సమాధానం ఇచ్చారు. బ్రూస్ లీ చిత్రం “మిస్‌ఫైర్” అవ్వడానికి ఏకైక కారణం కథా లోపమేనని ఆయన అన్నారు. సినిమా ఎగ్జిక్యూషన్‌లో గానీ, నటీనటుల నటనలో గానీ ఎలాంటి లోపం లేదని, కేవలం ఎంచుకున్న కథ కరెక్ట్ కాకపోవడమే కారణమని శ్రీను వైట్ల తెలిపారు. “కథ కరెక్ట్ కాకపోతే, మనం అన్ని ప్రయత్నాలు చేసినా అది అలంకరణ లాగే ఉంటుంది తప్ప, ఉపయోగం ఉండదు” అని ఆయన అన్నారు.ఆయన లేకపోతే నేను ఇప్పుడు ఇలా ఉండేదాన్ని కాదు.. నన్ను స్టార్ హీరోయిన్‌ను చేశారురామ్ చరణ్ అద్భుతమైన నటన కనబరిచారని, ఆయన కష్టపడి పనిచేశారని తెలిపారు. చిరంజీవి గారి ప్రత్యేక పాత్ర, హెలికాప్టర్ ఎంట్రీ ఇప్పటికీ అభిమానులకు హైలైట్‌గా నిలిచాయని, అది తనకు ఒక గొప్ప అనుభవమని వైట్ల పేర్కొన్నారు. బ్రూస్ లీ ఒక “చెడు చిత్రం” కాదని, కేవలం అనుకున్న ఫలితం రాలేదని స్పష్టం చేశారు. వరుస హిట్స్ తర్వాత బ్రూస్ లీ చేసినప్పుడు, రామ్ చరణ్, మెగా ఫ్యామిలీకి ఉన్న ఫాలోయింగ్ తమ కాంబినేషన్‌పై అంచనాలు పెంచిందని అన్నారు.రామ్ చరణ్ ప్రెజెన్స్, డ్యాహీరోయిన్‌ను చేశారురామ్ చరణ్ అద్భుతమైన నటన కనబరిచారని, ఆయన కష్టపడి పనిచేశారని తెలిపారు. చిరంజీవి గారి ప్రత్యేక పాత్ర, హెలికాప్టర్ ఎంట్రీ ఇప్పటికీ అభిమానులకు హైలైట్‌గా నిలిచాయని, అది తనకు ఒక గొప్ప అనుభవమని వైట్ల పేర్కొన్నారు. బ్రూస్ లీ న్స్‌లు అన్నీ బాగున్నాయని, ఎక్కడో కెమిస్ట్రీ కరెక్ట్‌గా సెట్ అవ్వలేకపోయిందని భావించారు. భవిష్యత్తులో రామ్ చరణ్‌తో మళ్ళీ కలిసి పనిచేసే అవకాశం ఎప్పుడైనా రావచ్చని వైట్ల సూచించారు. రామ్ చరణ్ క్రమశిక్షణ, నటుడిగా ఎదిగిన తీరు, తన వాయిస్ అంటే తనకు చాలా ఇష్టమని వైట్ల అన్నారు.ప్రస్తుతం తన లక్ష్యం సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడమేనని వైట్ల పేర్కొన్నారు. సినిమాపై గతంలో కేవలం ప్యాషన్ మాత్రమే ఉండేదని, ఇప్పుడు “గ్రాటిట్యూడ్‌తో కూడిన ప్యాషన్” ఉందని, సినిమా వల్లే తాను సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నానని అన్నారు. మంచి చిత్రాలు చేయాలనే తపనతో ఉన్నానని తెలిపారు.

# అవును.. ప్రేమకథ చిత్రం హీరోయిన్ ఏమైపోయింది

## నందిత రాజ్

చారడేసి కళ్లు.. ముగ్ధమనోహరమైన రూపం.. ఇలా చూడగానే ఇట్టే ఆకట్టుకునే అందం. అయితే ఆ చారడేసి కళ్లతోనే ప్రేమకథా చిత్రమ్ సినిమాలో అందరినీ భయపెట్టింది నందితా రాజ్. మారుతి దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన ఈ కామెడీ హర్రర్ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. డైరెక్టర్‌గా మారుతికి, హీరోగా సుధీర్‌బాబుకి మంచి బ్రేక్ ఇచ్చింది.సుధీర్ బాబు హీరోగా నటించిన ప్రేమ కథ చిత్రం సూపర్ హిట్ సాధించింది. ఈ సినిమాకు మారుతి దర్శకత్వం వహించారు. 2013 ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కింది. ఈ సినిమాలో హీరోయిన్ గా నందిత రాజ్ నటించింది. సప్తగిరి, ప్రవీణ్ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాలో సప్తగిరి చేసిన కామెడీ సినిమాకే హైలైట్ అనే చెప్పాలి. అలాగే హీరోయిన్ నందిత తన నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది. గ్లామర్ పరంగా ఈ చిన్నదానికి మంచి మార్కులు పడ్డాయి. ఓరిమకథ చిత్రం తర్వాత ఈ అమ్మడు పెద్ద హీరోయిన్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ అలా జరగలేదు. ఊహించని విధంగా ఈ ముద్దుగుమ్మకు ఆఫర్స్ తగ్గిపోయాయి. అయితే ఈ సినిమా తర్వాత పెద్దగా సినిమాల్లో కనిపించలేదు నందిత.ఆయన లేకపోతే నేను ఇప్పుడు ఇలా ఉండేదాన్ని కాదు.. నన్ను స్టార్ హీరోయిన్‌ను చేశారునిజానికి తేజ దర్శకత్వం వహించిన నీకు నాకు డాష్ డాష్ అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఆ తర్వాత వచ్చిన ప్రేమ కథ చిత్రం ఈ అమ్మడికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ప్రేమ కథ చిత్రం సినిమా తర్వాత నందిత వరుసగా సినిమాలు చేసింది. మరోసారి సుధీర్ బాబుతో కలిసి కృష్ణమ్మ కలిపింది నిన్ను నన్ను సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అప్పుడెప్పుడో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలో చిన్న పాత్రలో కనిపించింది. ఆతర్వాత మళ్లీ కనిపించలేదు ఈ అమ్మడు.మహేష్‌తో ఉన్న ఈ చిన్నోడు.. ఇప్పుడు అమ్మాయిల డ్రీమ్ బాయ్.! రీసెంట్‌గానే హిట్ కొట్టాడుఅయితే ఈ చిన్నది ఇప్పుడు ఎలా ఉంది.? ఎక్కడ ఉంది.? అంటూ నెటిజన్స్ గూగుల్ ను గాలిస్తున్నారు. నందిత 2019లో విశ్వమిత్ర అనే సినిమాలో నటించింది. ఆతర్వాత సినిమాలకు దూరంగా ఉంటుంది. సోషల్ మీడియాలోనూ ఈ చిన్నది యాక్టివ్ గా ఉండదు. దాంతో ఈ అమ్మడు లేటెస్ట్ ఫొటోస్ కోసం నెటిజన్స్ కాస్త గట్టిగానే గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ అమ్మడి లేటెస్ట్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆ ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి.





# : ఇరుముడి క్రేజ్.. ‘మల్లెపూల పల్లకి’ పాటకు డ్యాన్స్ చేసిన జబర్దస్త్ వర్ష

మాస్ మహారాజా రవితేజ నటించిన లేటెస్ట్ సినిమా ‘ఇరుముడి’. గత శుక్రవారం (ఆగస్టు 21) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ దిశగా దూసుకెళ్లుతోంది. థియేటర్లలో రిలీజై వారం రోజులు గడిచినా ఈ సినిమాకు హౌస్ ఫుల్ కలెక్షన్లు వస్తున్నాయి. చాలా చోట్ల ఈ సినిమా కోసం ధర్నాలు, ఆందోళనలు జరుగుతుండడం ఇరుముడి సినిమా క్రేజ్ కు అద్దం పడుతోంది.ట్రేడ్ నిపుణులు సైతం రవితేజ సినిమా కలెక్షన్లను ఊహించలేకపోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా రూ. 150 కోట్ల కలెక్షన్లు సాధించినట్లు తెలుస్తోంద. ఇరుముడి జోరు చూస్తుంటే త్వరలోనే ఈ సినిమా రూ. 200 కోట్ల క్లబ్ లో చేరవచ్చు. ఇక థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శిస్తున్నప్పుడు ఆడియెన్స్ బాగా ఎమోషనల్ అవుతున్నారు. ముఖ్యంగా ‘మల్లెపూల పల్లకి’ పాట వచ్చినప్పుడు ప్రేక్షకులు థియేటర్లలో పూలు, హారతులు పడుతున్నారు. ఆధ్యాత్మిక భావనతో, భక్తి భావంతో డ్యాన్సులు చేస్తున్నారు. ఇక సోషల్ మీడియాలోనూ మల్లెపూల పల్లకి సాంగ్ మార్మోగుతుంది. ఎక్కడ చూసినా ఇరుముడి పాట రీల్స్, డ్యాన్స్ వీడియోలే కనిపిస్తున్నాయి. సామాన్య జనాలే కాకుండా సెలబ్రిటీలు సైతం ఈ పాటకు కాలు కదుపుతున్నారు. తాజాగా జబర్దస్త్ నటి వర్ష కూడా ఇరుముడి సాంగ్ కు డ్యాన్స్ వేసింది. తన బృందంతో కలిసి ‘మల్లెపూల పల్లకి’ పాటకు స్టెప్పులేసింది.అయ్యప్ప స్వాముల తరహాలో సంప్రదాయ దుస్తులు ధరించిన జబర్దస్త్ వర్ష తన బృందంతో కలిసి ఎంతో ఎనర్జిటిక్ గా ఇరుముడి పాటకు స్టెప్పులేసింది. అనంతరం ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు, సినీ అభిమానులు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# ఇండియాలోనే తోప్ హీరోయిన్.. వరుసగా 7 ఫ్లాపులు

సినిమా ఇండస్ట్రీలో ఇప్పుడు పాన్ ఇండియా సినిమాల హవా నడుస్తుంది. భారీ బడ్జెట్ తో సినిమాలు తెరకెక్కుతూ కలెక్షన్స్ కూడా అదే రేంజ్ లో రాబడుతున్నాయి. సినిమాకు యావరేజ్ టాక్ వచ్చినా కూడా కలెక్షన్స్ మాత్రం కుమ్మేస్తున్నాయి. చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా అన్ని సినిమాలు పాన్ ఇండియా లెవల్ లో విడుదలవుతున్నాయి. అలాగే హీరో హీరోయిన్స్ కూడా భారీ రెమ్యునరేషన్ అందుకుంటున్నారు. ఇక హీరోయిన్స్ కూడా హీరోలకు సమానంగా రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు. ఇక ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ ఇండస్ట్రీలోనే తోపు.. అందరి కంటే ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్న హీరోయిన్ ఈ అమ్మడే..ఇది కూడా చదివేసేయండి : అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్‌లాంటి స్టార్ హీరోలతో సినిమాలు.. కానీ ఒక్క హిట్ కూడా లేదు.. ఇప్పుడు ఇలాచాలా మంది ముద్దుగుమ్మలు హీరోలకు సరి సమానంగా రెమ్యునరేషన్ అందుకుంటున్నారు. కొంతమంది సీనియారిటీతో.. మరికొంతమంది స్టార్ డమ్ తో భారీగా పారితోషకాలు అందుకుంటున్నారు. మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ కు వరుసగా 7 ఫ్లాపులు ఉన్నాయి. అయినా కూడా భారీగా రెమ్యునరేషన్ అందుకుంటుంది. ఆ అందాల భామ మరెవరో కాదు గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా.. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణించిన ప్రియాంక చోప్రా అక్కడ అందరు స్టార్ హీరోల సినిమాల్లో నటించింది.ఆతర్వాత హాలీవుడ్ లోనూ సినిమాలు చేసింది. ఇక ఇప్పుడు తెలుగులో నటిస్తుంది. గతంలో రామ్ చరణ్ తో కలిసి జంజీర్ అనే సినిమా చేసింది. ఇక ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి వారణాసి సినిమాలో నటిస్తుంది. ప్రియాంక చోప్రా స్టార్ హీరోల కంటే ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్ గా రికార్డ్ క్రియేట్ చేశారు. వరుసగా 7 ఫ్లాపులు ఉన్నప్పటికీ ఈ ముద్దుగుమ్మ రెమ్యునరేషన్ విషయంలో ఎక్కడ తగ్గడం లేదు. కాగా వారణాసి సినిమా కోసం ప్రియాంక ఏకంగా రూ. 25కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటుందట. చెప్పాలంటే ఇండియాలోనే భారీ రెమ్యునరేషన్ అందుకుంటున్న హీరోయిన్ ఈ అమ్మడే.. స్టార్ హీరోయిన్స్ నయనతార, త్రిష 11 నుంచి 15 కోట్ల వరకు మాత్రమే అందుకుంటున్నారు. ఇక బాలీవుడ్ లో తెరకెక్కుతున్న రామాయణం సినిమాలో సీతగా నటిస్తున్న సాయి పల్లవి రూ. 20కోట్లు తీసుకుంటుందని టాక్.

# మా నాన్నకు ఇద్దరు భార్యలు.. నేను 19ఏళ్లకే పెళ్లి చేసుకున్నా.?



నటి వనితా విజయకుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన వృత్తిగత, వ్యక్తిగత జీవితంలోని ఎత్తుపల్లాలను, అంతర్గత భావోద్వేగాలను పంచుకున్నారు. ఆమె తన జీవితాన్ని ఒక పోరాటంగా అభివర్ణిస్తూ, గ్రేస్‌ఫుల్‌గా జీవించానని పేర్కొన్నారు. మహిళగా తన ప్రయాణంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు. వనిత సినీ పరిశ్రమను వదిలి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పి.వాసు గారి దగ్గర సుమారు పది సినిమాలకు పనిచేశారు. అక్కడ దర్శకురాలిగా, నటిగా, టెక్నీషియన్ గా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, అది తనకు ఒక పెద్ద స్కూల్ లాంటిదని తెలిపారు. సినీ రంగం తర్వాత ఆమె తెర వెనుక అనేక పనులు చేశారు. ఒక ఛానెల్‌లో పనిచేసి, ఆ తర్వాత కంప్యూటర్ గ్రాఫిక్స్ సంస్థ ప్రైమ్ ఫోకస్, ఇండియాస్ నంబర్ వన్ సీజీ అండ్ డీఐ కంపెనీలో సౌత్ ఇండియా మార్కెటింగ్ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. డీఐ (డిజిటల్ ఇంటర్మీడియట్) టెక్నాలజీని సౌత్ ఇండియాకు పరిచయం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఇది పూర్తి కార్పొరేట్ కెరీర్‌గా పేర్కొంటూ, మీడియా మార్కెటింగ్, బ్రాండింగ్, పీఆర్, ఈవెంట్‌లు వంటి అనేక రంగాలలో పనిచేసిన అనుభవం ఉందని వివరించారు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES, 3 88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151.